## క్లుప్తంగా

### ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



చిత్రావతి నదిలో అనుమానిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ధర్మవరం ఆర్డీఓ మహేష్

**బత్తలపల్లి:** చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల నుంచి మాత్రమే ఇసుక తీసుకువెళ్లాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రామాపురం, తాడిమర్రి మండలంలోని చిన్నచిగుళ్లరేవు తదితర ప్రాంతాలను తహసీల్దార్ స్వర్ణలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇసుక తరలింపులో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాల్లో మాత్రమే సేకరించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలు పర్యావరణానికి హానికరమైందిగా ఉండటంతో పాటు రాష్ట్ర ఆదాయానికి నష్టాన్ని కలిగిస్తున్నాయన్నారు. టిప్పర్లలో ఇసుకను తరలించే సమయంలో ఇసుకపై టార్పాలిన్ కప్పాలని సూచించారు. సాయంత్రం 6 గంటల తరువాత ఇసుక రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

### అటల్ బిహారి వాజ్‌పేయికి నివాళి

**పుట్టపర్తి టౌన్:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య విలువలను దేశం నలుమూలలకు చాటి చెప్పిన మహానేత వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్ర బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సోకే రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శులు నారాయణ, లక్ష్మీనారాయణ నాయక్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అఖండ రామభజన



భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు

**ఎన్పీకుంట:** పి.కొత్తపల్లి గ్రామంలో ఉన్న కోదండ రామాలయంలో శనివారం ఆలయ ధర్మకర్తలు తిరుపతి గంగిరెడ్డి, వైస్ఎంపీపీ కేశవరెడ్డి ఆధ్వర్యంలో అఖండ రామభజన నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం నాలుగో శనివారం ఆలయంలో అఖండ రామభజన చేస్తామని వారు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు చీమలచెరువుపల్లి, రెడ్డివారిపల్లి, ఎన్.పీ.కుంట, బలిజపల్లి, ఎద్దులవారికోట, ఎదురుదోన, యాదలవాండ్లపల్లి, ఒట్టంవారిపల్లి గ్రామాలకు చెందిన వివిధ భజన బృందాలు భక్తిగీతాలు ఆలపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది

**పుట్టపర్తి టౌన్:** ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం, అన్ని సబ్‌డివిజన్లలో పోలీస్ అధికారులు, డీపీఓ సిబ్బంది, ఏఆర్ పోలీసులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చుట్టు ప్రక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ల పోలిస్టేషన్లలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టి శుభ్రం చేస్తామని తెలిపారు.

### విరబూసిన బ్రహ్మ కమలం



**నల్లమాడ:** మండలంలోని చౌటకుంటపల్లిలో మాజీ సైనికుడు యనమల విశ్వనాథరెడ్డి ఇంటి వద్ద శనివారం తెల్లవారుజామున 10 బ్రహ్మ కమలాలు విరబూశాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బ్రహ్మ కమలాలను తిలకించారు. బ్రహ్మ కమలాలకు పూజలు చేశారు.

# ఆరుబయటకు వెళ్లాల్సిందే..

స్వచ్ఛ భారత్‌లో భాగంగా బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని పదేపదే చెప్పే అధికారులు.. కార్యాలయాల్లో వసతులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు 'ఆత్మగౌరవ' ప్రశ్న ఎదురవుతోంది. ఒకటి, రెండు అత్యవసరమైతే మూత్ర విసర్జన శాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఆరుబయట చాటుకెళ్లి తీర్చుకోవాల్సి వస్తోంది.

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు
- పనుల కోసం వచ్చిన ప్రజలకు తప్పని తిప్పలు
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం



బత్తలపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం

**బత్తలపల్లి:** నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం ప్రజల తాకిడి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ గ్రామాలకు 5 నుంచి 20 కిలో మీటర్ల దూరంలోనే ఉన్నాయి. మారుమూల ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం రోజూ దాదాపు 500 మంది ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. వీరికి అత్యవసరాలు (కాలకృత్యాలు) తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేవు. అత్యవసరమైతే గోడ చాటుకెళ్లి ముగించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఆత్మగౌరవం కోసం ఇంటింటికీ మరుగుదొడ్లు' అని చెప్పే అధికారులు సొంత ఇంటిని వదిలేశారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లు కొన్ని కార్యాలయాల్లో ఉన్నప్పటికీ వాటిని ఉద్యోగులు మాత్రమే వాడుతున్నారు. అందులో కొన్ని నిర్వహణ లేక కంపు కొడుతున్న పరిస్థితులు ఉన్నాయి. జనసమ్మర్ధనం ఉండే ప్రధాన కూడళ్లలోనూ పబ్లిక్ టాయిలెట్లు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో వచ్చే ప్రజలకు 'అత్యవసర' సమస్య తీర్చాలని పులువురు కోరుతున్నారు.

= మరుగుదొడ్ల నిర్మాణంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూడా టాయిలెట్స్ లేకపోవడం గమనార్హం. ఆయా మండల కేంద్రాల్లోనూ, ధర్మవరం మండల వ్యవసాయశాఖ, మండల అభివృద్ధి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ సబ్‌డివిజన్, ఉపాధి కార్యాలయం, పశువైద్యశాల, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్, పోలీస్ స్టేషన్, హౌసింగ్, రిజిస్ట్రార్, సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో ఉద్యోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరం. జాతీయ బ్యాంకుల్లో సైతం మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

#### పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి



బహిరంగ మలమూత్ర విసర్జన వద్దని చెప్పే అధికారులు ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి అవసరాల నిమిత్తం వచ్చే అర్జీదారులు, ప్రజలు చెప్పుకోలేని బాధతో అవస్థలు పడుతున్నారు. ఉద్యోగులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యాలయం పరిధిలో అవసరాల నిమిత్తం టాయిలెట్ల సౌకర్యాన్ని కల్పించాలి.

– కమతం కాటమయ్య,
సీపీఐ అనుబంధ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, బత్తలపల్లి

#### ప్రయాణికులకూ అగచాట్లే



మండల కేంద్రమైన బత్తలపల్లిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పలువురు ప్రజలు పనుల నిమిత్తం వస్తుంటారు. వారు అక్కడికి వచ్చిన సమయంలో అత్యవసరమైతే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళల అవస్థలు దారుణంగా ఉంటున్నాయి. కార్యాలయాల్లో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. అవసరాలు తీర్చుకోవాలంటే కార్యాలయాల నుంచి కూడలిలోని పబ్లిక్ టాయిలెట్ వద్దకు అర కిలోమీటరు దూరం నడవాల్సి ఉంది.

– నంద, అర్జీదారుడు,
సంజీవపురం, బత్తలపల్లి మండలం

#### మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు



కార్యాలయంలో ఉద్యోగులు, అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజల అవస్థలను గమనించాం. అందుకే తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ మరుగుదొడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇక్కడ ఎంపీడీఓ, తహసీల్దార్, ఉపాధి, ఐకేపీ కార్యాలయాలు ఉన్నందున ప్రజల అవసరాల నిమిత్తం మరుగుదొడ్లు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది.

– నరసింహనాయుడు,
ఎంపీడీఓ, బత్తలపల్లి

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

**పుట్టపర్తి టౌన్:** ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏర్పాటై ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం జిల్లా కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. యూనియన్ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరఫున అనేక ఉద్యమాలు చేసి విజయాలు సాధించినట్లు తెలిపారు. నాలుగో తరగతి ఉద్యోగి నుంచి గ్రూప్–1 అధికారుల వరకు అన్ని కేడర్ల ఉద్యోగులకు ఈ సంఘంలో సభ్యత్వం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోవిందప్ప, రవి, ముసలి రెడ్డి, సహాయ కార్యదర్శి కిషోర్, వివిధ తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### మద్యం సేవిస్తున్న వారిపై కేసు నమోదు

**కదిరి టౌన్:** కదిరి సమీప ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న 11 మందిపై కేసు నమోదు చేసినట్లు కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. కదిరి ఎస్ఐ సుమతి సిబ్బందితో కలిసి శనివారం కదిరి పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌తో ప్రత్యేక నిఘా పెట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించారు. పారిపోతున్న మందుబాబులను వెంబడించారు. 11 మందిని పట్టుకుని కేసు నమోదు చేశారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

**కొత్తచెరువు:** హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం మండలంలోని కొడపగాని పల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టోలోని హామీలను గుర్తు చేస్తూ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చి, నెరవేర్చలేదన్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనకు ఇప్పటి పాలనలకు గల తేడా వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీటీసీ వరలక్ష్మి, సర్పంచ్ అలివేలమ్మ, మాజీ సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, పాదయాత్ర వాల్మీకి శంకర, మండల ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కొత్తకోట నరేష్, ఆదినారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ముద్దల భాస్కర్, బేల్దారి ఎల్లప్ప, వెంకటరామి రెడ్డి, శోధన పల్లి రామాంజనేయులు, హనుమంత్ రెడ్డి, నరసింహా రెడ్డి, ముస్కినా, భార్గవ్ రెడ్డి, మారుతి జానీ, రాము, పూర్ణ వాల్మీకి కేశవ, శ్రీకాంత రెడ్డి, డైలే కేశవ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు అవార్డులు



మంత్రి సవితమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పి.జ్యోతి లక్ష్మీబాయి



డీఎం మైనుద్దీన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనిల్ సిన్హా

**కదిరి అర్బన్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులైన భార్యభర్తలు పి.జ్యోతి లక్ష్మీబాయి, అనిల్ సిన్హాకు అవార్డులు అందజేశారు. కదిరి మండలం యర్రదొడ్డి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.జ్యోతి లక్ష్మీబాయి.. మంత్రి సవితమ్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తున్న అనిల్ సిన్హా.. ఉత్తమ ఇంధన పొదుపు డ్రైవర్‌గా డీఎం మైనుద్దీన్ చేతుల మీదుగా నగదు పురస్కారం అందుకున్నారు. భార్యభర్తలకు అవార్డులు రావడంతో ఆయా కార్యాలయాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డు కమ్ బ్రిడ్జి, మినీ డ్యాం పరిశీలన



చిత్రావతి నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**బత్తలపల్లి:** మండలంలోని సంఘమేశ్వర క్షేత్రం సమీపంలో ప్రవహిస్తున్న చిత్రావతి నదిపై ఆర్డీటీ సహకారంతో నిర్మించిన రోడ్డు కమ్ బ్రిడ్జి, మినీ డ్యాంను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిత్రావతి నది ప్రవహిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నీరు నిల్వ ఉండటం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చిత్రావతి నదిలో బయపరెడ్డి గంగపూజ చేశారు. రైతులందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండి నాగభూషణ, బోయపాటి సూర్యనారాయణ, బండి ఆదినారాయణ, ఈడిగ కాశప్ప, వెంకటగారిపల్లి వెంకటరాముడు, అక్కిం ముసలప్ప తదితరులు పాల్గొన్నారు.

### డ్రోన్ కెమెరాలతో నిఘా



అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్న దృశ్యం

**పుట్టపర్తి టౌన్:** జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకాపాలు, మద్యపానం అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం జిల్లా వ్యాప్తంగా అటవీప్రాంతం పాగుపడిన నివాసాలు, నిర్మానుష ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలు రూపుమాపేందుకు ఎస్పీ రత్న ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు.

# ముకుందా.. మురారీ



చెన్నేకొత్తపల్లిలో పూజలందుకున్న శ్రీకృష్ణుడు



ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



పుట్టపర్తి 13 వార్డు గోకులంలో కృష్ణుడి విగ్రహానికి పూజలు

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**ధర్మవరం అర్బన్:** పట్టణంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామికి సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధన పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుడికి విశేష ఉపచారాలతో క్షీరాభిషేకం చేశారు. చెన్నకేశవస్వామి ఆలయం బయట ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను వివిధ రకాల పూలతో అలంకరించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణంలోని యాదవవీధిలో డాక్టర్ వివేక్ ఆధ్వర్యంలో జయకృష్ణస్వామి ఆలయంలో గోకులాష్టమి శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

**పుట్టపర్తి టౌన్:** పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వేణుగోపాల స్వామి ఆలయం, వాసవీమాత దేవాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే భక్తులు వేణుగోపాల స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 13వ వార్డు గోకులంలో శ్రీకృష్ణ సత్యభామ విగ్రహాలను సుందరంగా అలంకరించారు. కోవెలగుట్టపల్లి గ్రామంలో యాదవ కులస్తుల ఆధ్వర్యంలో రాధా కృష్ణుల విగ్రహాలను ఊరేగించారు.

**మద్దన్నగారిపల్లిలో..**

**ముదిగుబ్బ:** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మద్దన్నగారిపల్లిలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు నరహరి, వరుణ్‌కుమార్, విశ్వనాథ్, రామాంజి, పోతులూరు, హరిశివ, నరసింహులు, వెంకటయ్య, విశ్వమూర్తి, బీమరాజ్ తదితరులు పాల్గొన్నారు. ముదిగుబ్బలో కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. స్థానిక బస్ షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు చేశారు.

**బత్తలపల్లి:** మండలంలోని ఈదుల ముష్టూరు, సంజీవపురం, సంగాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. సంఘమేశ్వరం, పోట్లమర్రి శివాలయంలో భక్తుల సందడి నెలకొంది. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికలుగా అలంకరించారు.

**నల్లచెరువులో..**

**నల్లచెరువు:** మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరై వేణుగోపాల స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాదెం శివారెడ్డి పాల్గొన్నారు.

**వేపలకుంటలో..**

**గాండ్లపెంట:** వేపలకుంట గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు.

**చెన్నేకొత్తపల్లి:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని శనివారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలోని శ్రీకృష్ణమందిరంలో స్వామి వారి మూలమిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేకంగా పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నేకొత్తపల్లిలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో న్యామద్దెల సర్కిల్ వద్ద ప్రత్యేకంగా మంటపాన్ని ఏర్పాటు చేసి అందులో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని, చివరి రోజు స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూల పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. కోన కణ్వాశ్రమంలోని పాండురంగ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి.

**కనగానపల్లి:** కనగానపల్లి, బద్దలాపురం, భానుకోట, తూంచర్ల గ్రామాల్లోని యాదవులు శ్రీ కృష్ణుని ప్రతిమలు పెట్టి పూజలు నిర్వహించారు. పిల్లలను చిన్ని కృష్ణుడు, గోపికల వేషాధారణ వేయించి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



ముదిగుబ్బ: మద్దన్నగారిపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



గాండ్లపెంట: శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

### ఆలయాలకు శ్రావణ శోభ



ఖాద్రీశుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకర్గాల్లో శనివారం శ్రావణ మాస సందడి నెలకొంది. కదిరిలో ఖాద్రీశుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది. పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. బత్తలపల్లి, తాడిమర్రి ఆలయాల్లో పూజలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్:



పాలపాటి దిన్నెలో కోలాటం ఆడుతున్న దృశ్యం

## భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని శ్రీనివాసనగర్ ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ఏడు శనివారాల వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు రాజేష్ వివిధ రకాల పూలు, తులసీ ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న మహిళలు